క్లుప్తంగా

వ్యాయామ కళాశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్

దెందులూరు: ఎన్నో అవకాశాలు నేడు ఆదివాసీలకు విద్యార్థులందరికీ అందుతున్నాయని వాటిని ఉపయోగించుకుని భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్ అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నృత్య ప్రదర్శన, డిబేట్లు నిర్వహించారు. దేశ ప్రథమ మహిళ అయిన భారత రాష్ట్రపతి సైతం ఒక ఆదివాసీ అని విద్యార్థులందరూ ఆమెను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ పీడీకే ప్రసాద్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ శ్యామల, ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్ ఉన్నారు.

అలుగులగూడెంలో ఓట్ల పరిశీలన

దెందులూరు: అలుగులగూడెంలో బుధవారం 88వ బూత్‌లో ఓట్ల పరిశీలన నిర్వహించామని మండల వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి శ్రీనివాస్, ఎంపీటీసీ పులిపాటి ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసన్న రాణి, కమ్ముల రవి, అన్నారు. బుధవారం అలుగులగూడెంలో బీఎల్‌ఓలతో కలిసి 88వ బూత్‌లో ఇంటింటా ఓట్ల పరిశీలన చేశారు. అర్హులై ఉండి, ఓటు లేనివారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మతోన్మాద శక్తులను అణచివేయాలి

గణపవరం: దేశంలో రోజురోజుకు మతోన్మాద శక్తుల ఆగడాలు పెరిగి పోతున్నాయని, వెంటనే కేంద్ర ప్రభుత్వం మతోన్మాదులను కఠినంగా అణిచి వేయాలని పలువురు వామపక్ష నాయకులు కోరారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా గణపవరం మండల సీపీఎం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పిప్పర సెంటర్‌లో ధర్నాచేసి, మతోన్మాద దిష్టి బొమ్మను దహనం చేశారు. కేవీపీఎస్ మండల శాఖ అధ్యక్షుడు చిన్నం నాగేశ్వరరావు మాట్లాడుతూ క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశంలోని ప్రజలంతా మత, కుల దురహంకారులను ఐకమత్యంగా ఎదుర్కొనాలని, దేశం నుంచి తరిమి కొట్టాలని పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా పిప్పర మూడురోడ్ల కూడలిలో మతోన్మాదం నశించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎం.పెంటారావు, కె.ప్రసాద్, ఎం.చినబాబు, ఇ.సతీష్ ఆర్. వెంకన్న పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెదవేగి : పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ప్రసాద్ కుమార్‌కి వచ్చిన సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి పెదవేగి పోలీస్ స్టేషన్ పరిధిలో పినకడిమి గ్రామంలో పేకాట ఆడుతున్న వారిపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు. నలుగురిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ.34,200 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసును నమోదు చేసేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌కుమార్ పెదవేగి పోలీసులకి అప్పగించినట్లు ఎస్సై తెలియజేశారు.

ఆలయంలో షెడ్డు నిర్మాణానికి విరాళం

పెదవేగి : ఆంజనేయస్వామి ఆలయంలో షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి విరాళం అందించారు. బుధవారం పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి స్వయంగా రూ.20 వేలను గ్రామ నాయకులకు విరాళంగా అందించారు.

పురుగుమందు ప్రభావానికి వ్యక్తి మృతి

పెదవేగి : పంటకు పురుగుమందు పిచికారీ చేస్తూ, దాని ప్రభావానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాళ్ళగోకవర్గానికి చెందిన బండి రాటాలు మంగళవారం వరి పొలానికి పురుగుమందు పిచికారీ చేశాడు. రాటాలు భార్య రంగమ్మ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో భర్తకు భోజనం తీసుకెళ్లింది. ఆ సమయంలో రాటాలు పురుగుమందు పిచికారీ చేసిన చేతులతోనే మంచినీళ్లు తాగాడు. కొద్దిసేపటికి అతను అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాటాలు (52) మంగళవారం రాత్రి మృతిచెందాడు. దీనిపై కేసు నమోదుచేసి, శవపంచనామా నిర్వహించి, శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని ఎస్సై తెలిపారు. బండి రాటాలు మృతి విషయం తెలిసిన వెంటనే మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు గుత్తా ప్రసాద్, బొద్దు సతీష్, ఘంటా ప్రసాద్, చెరుకూరి భాస్కర్ తదితరులు ఉన్నారు.

అమరవీరుల త్యాగాలు ఆదర్శనీయం



ఉంగుటూరు: గోపీనాథపట్నంలో 'నా భూమి- నా దేశం'లో పాల్గొన్న ఎంపీపీ శ్రీలక్ష్మి, సర్పంచి విష్ణు



దెందులూరు: గాలాయగూడెంలో శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ తదితరులు



గణపవరం: కాశిపాడులో అమరవీరుల స్తూపం వద్ద ప్రమాణం చేస్తున్న గ్రామస్తులు

భీమడోలు: దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల జీవితాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పూళ్ల సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ అన్నారు. మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీల్లో బుధవారం ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా నా భూమి–నా దేశం.. నేలతల్లికి నమస్కారం, వీరులకు వందన కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమాన్ని సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ ప్రారంభించారు. పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేసారు. గ్రామకార్యదర్శి సూర్యకుమార్, ఎంపీటీసీ గొండు కృష్ణ చైతన్య, పేరెంట్స్ కమిటి చైర్మన్ పి.నాగేశ్వరరావు, వార్డు సభ్యుడు యాసా వెంకట్రామయ్య, హెచ్‌ఎం భువనేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నా భూమి– నా దేశం నేలతల్లికి నమస్కారం

ఉంగుటూరు: దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల సేవలు వెలకట్టలేనివని ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. ప్రతి పంచాయతీలో నా భూమి–నా దేశం.. నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో అమరవీరుల జ్ఞాపకాలకు స్తూపాలను ఆవిష్కరించారు. గోపినాథపట్నంలో సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి పాల్గొన్నారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ వీర జవాన్లకు నివాళులర్పించారు. సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు పుత్సకాయల విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు. వెల్లమిల్లి గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, సర్పంచి వస్కకుమార్‌రాజ, కార్యదర్శి బాలాజీ, ఉప సర్పంచి నాగు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎ.గోకవరం లో సర్పంచి మిద్దే సత్యవతి ఆధ్వర్యంలో శిలాఫలకం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మిద్దే వెంకటేశ్వరరావు, నాచుగుంటలో నిర్వహించిన కార్యక్రమంలో వైసీపీ నాయకుడు ఏలేటి సురేష్, ఏలేటి సుబ్బారావు, కార్యదర్శి ప్రసాద్, వలంటర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. తిమ్మయ్యపాలెంలో సర్పంచి సింహాద్రిశ్రీదేవి, సత్యనారాయణ, ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. చేబ్రోలులో సర్పంచి రాందే లక్ష్మీసునీత, మాజీ సర్పంచి రాందేరాజు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గాలాయగూడెంలో..

దెందులూరు: నా భూమి.. నా దేశం నేల తల్లికి నమస్కారం కార్యక్రమం బుధవారం గాలాయగూడెం పంచాయతీలో నిర్వహించారు. సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు శిలాఫలకం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో విష్ణు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సొంగా వెంకటేశ్వరరావు, పెండ్లి నాని, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు ఉన్నారు.

త్యాగ ధనుల స్మృతి చిహ్నాల నిర్మాణం పూర్తి చేయండి

పెదపాడు: దేశం కోసం ప్రాణత్యాగం చేసినవారి గౌరవార్థం వారి స్మృతి చిహ్నాల నిర్మాణాలను ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి ప్రారంభించారు. నాయుడుగూడెంలో స్మృతి చిహ్నం నిర్మాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం ప్రతి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేయాలని సూచించారు.పెదపాడు మండలంలోని తాళ్లగూడెంలో నిర్మించిన స్మృతి చిహ్నాన్ని ఈఓపీఆర్డీ సాధనాల సూర్యకుమార్ పరిశీలించారు. వట్లూరులో మేకా శ్రీనివాస్, తోటగూడెంలో మైనీడి వెంకటేశ్వరరావు స్మృతి చిహ్నాల నిర్మాణాన్ని పరిశీలించారు. నాయుడుగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధాబత్తిన జోజమ్మ, కార్యదర్శి ధర్మగోవిందు, కట్నేని తులసీరామ్ పాల్గొన్నారు.

సమరయోధుల ఆశయ సాధనే ధ్యేయం

గణపవరం: దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధుల ఆశయసాధనకు మనమంతా పాటుపడాలని పలువురు వక్తలు అన్నారు. ఆజాదీకీ అమృత మహోత్సవం కార్యక్రమం ముగింపు సందర్భంగా బుధవారం గణపవరం మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వీరులకు ఘనంగా నివాళులర్పించారు. గ్రామంలోని అమరవీరుల స్థూపం వద్ద సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు జంపన పద్మావతి, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు తదితరులు గ్రామస్తులతో కలిసి అమరవీరుల ఆశయాలను సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. జల్లికొమ్మరలో సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం, మొయ్యేరులో సర్పంచ్ దుళ్ల కుటుంబరావు తదితరులు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు.

విద్యార్థులతో ప్రపంచశాంతి ర్యాలీ

ఉంగుటూరు: సైన్సు ఆవిష్కరణలు మానవ సౌభాగ్యానికి దోహదం చేయాలే గాని వినాశనానికి కాదని ఆప్కాస్ట్ కో ఆర్డినేటర్ భాస్కరరావు అన్నారు. బుధవారం కై కరం జిల్లా పరిషత్ హైస్కూల్లో హిరోషిమా, నాగసాకి దినోత్సవాన్ని నిర్వహించారు. భాస్కరరావు మాట్లాడుతూ ఆగస్టు 9 నాగసాకి నగరంపై ఆటం బాంబు ప్రయోగించిన రోజు అని అన్నారు. దీని వల్ల లక్షలాది మంది చనిపోయారని అన్నారు. సైన్సు పట్ల బాలలు ఆసక్తి పెంచుకుని మానవుల అభివృద్ధికి ఉపయోగపడేలా పనిచేయాలని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు శాంతి అంశంపై వ్యాసరచన, వక్తృత్వం , చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులతో ప్రపంచశాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె. జాన్, సీహెచ్ శ్రీనివాసరావు, పీవీ కన్నారావు, జి. గవరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోతునూరులో రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు

దెందులూరు: పోతునూరు గ్రామ పరిధిలో పాత పంచాయతీ పరిధిలో బ్రాంచి కాలువ దారిలో చేపల చెరువుకు వెళ్లే మార్గాన్ని మరొక ఆక్వా రైతు ఆక్రమించి గట్టు వేశాడని పోతునూరుకి చెందిన బీ.నూకరాజు, ఎం. రాజేంద్రప్రసాద్, సీఎస్ సాహెబ్ దెందులూరు ఎస్సై వీర్రాజుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పోతునూరుకు చెందిన బోయిన వెంకట సత్యనారాయణ అలియాస్ పాట్టియ్య చెరువు గట్టు రోడ్డును తన చేపల చెరువులోకి కలిపేసుకుంటూ రోడ్డంతా ఆక్రమించాడని, అదే గ్రామానికి చెందిన బి.నూకరాజు, ఎం రాజేంద్రప్రసాద్, సాహెబ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై బుధవారం విచారణ ప్రారంభించారు.

ఆయిల్‌పామ్ రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మేధినరావుపాలెంలో ఆయిల్‌పామ్ రైతు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఆయిల్‌పామ్ రైతుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం మేదినరావుపాలెంలో రైతు మేడికొండ వెంకటేశ్వరరావు పొలంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ రైతుల సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ గత ఎన్నికల్లో దెందులూరు మండలంలో నిర్వహించిన పాదయాత్రలో నేను ఉన్నానంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సమస్యలు విని ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోపే తెలంగాణ రైతులకు, ఏపీ రైతులకు మధ్య ఉన్న ధర వ్యత్యాసాన్ని నివారించేందుకు రూ. 84 కోట్లు ఏపీలో ఆయిల్‌పామ్ రైతులకు చెల్లించారని అన్నారు. భారతదేశం అవసరాల్లో 16 శాతం మాత్రమే ఎడిబుల్ ఆయిల్ తయారవుతోందని, మిగిలిది అంతా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామన్నారు. పతంజలి వంటి వ్యాపార దిగ్గజ సంస్థలు నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ సాగుకు సహాయ సహకారాలు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పెదవేగిలో రామశింగవరంలోని ఆయిల్‌పామ్ కేంద్రం, నర్సరీ కేంద్రాలు విజయరాయి, గోపన్నపాలెంలో ఏర్పాటు ద్వారా సేవలందిస్తున్నట్టు తెలిపారు. రైతులు సచివాలయాలకు వెళ్లి నమోదు చేయించుకుని మొక్కలు తీసుకువెళ్లి సాగు చేసుకోవచ్చన్నారు. పతంజలి సంస్థ దెందులూరు మండలంలో మౌలిక వసతుల కల్పనకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచులు ఎం.దుర్గాకుమారి రాజు, పర్వతనేని శ్రావణి సుధీర్, శనిపల్లి రామకృష్ణ, మెండేం సంతోష్‌కు మార్, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు, సొసైటీ చైర్మన్లు నల్లూరి వెంకట్రామయ్య, పాకలపాటి శ్రీనివాసరావు, కొమ్మిన రాము, కొలుసు గణపతిరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, పర్వతనేని వెంకట్రాజు, యలమర్తి రామకృష్ణ, కాటి సుధాకర్, జిల్లా హార్టీకల్చర్ ఆఫీసర్ రామ్మోహన్, నియోజకవర్గ హార్టీకల్చర్ ఆఫీసర్ కరణ్, పతంజలి కంపెనీ డీజీఎం వీరేంద్ర, ఫీల్డ్ మేనేజర్ మోహన్ ఉన్నారు.

క్రీడల్లో రాణించాలి

పెదవేగి : యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కొఠారు. అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగిలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే క్రీడాకారులకు బహుమతులు అందించారు. ప్రథమస్థానంలో నిలిచిన పెదవేగి జట్టుకు రూ.20వేలు, ద్వితీయ స్థానంలోని కుచింపూడి జట్టుకు రూ.12వేలు, తృతీయ స్థానంలోని కొప్పులవారిగూడెం జట్టుకు రూ. 8వేలు అందించారు. ఎంపీపీ తాతా రమ్య, జెడ్పీ వైస్ చైర్మన్ పి.విజయబాబు, పెదవేగి మాజీ సర్పంచ్ తాతా సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు. కామిరెడ్డి నాని పాల్గొన్నారు.

పంచాయతీ వార్డు ఎన్నికలకు నామినేషన్ల దాఖలు



పోలసానిపల్లిలో నామినేషన్ వేస్తున్న బొద్దాని ప్రసాద్

భీమడోలు: పోలసానిపల్లిలో 12వ వార్డు సభ్యుని ఎన్నికకు గురువారం రెండు నామినేషన్లు దాఖలు చేసారు. వైసీపీ బలపర్చిన అభ్యర్థి బొద్దాని ప్రసాద్ తన నామినేషన్‌ను స్టేజ్ వన్ అధికారిణి జీవన సంధ్యకు అందజేసారు. వైసీపీ సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా, ఎంపీటీసీ అంబటి దేవీ నాగేంద్రప్రసాద్ సమక్షంలో అభ్యర్థి బొద్దాని ప్రసాద్ తన నామినేషన్ పత్రాలను అధికారికి అందజేసారు. దీనితో పాటు డమ్మీ అభ్యర్థిగా బొద్దాని పెద్దిరాజు నామినేషన్ వేసారు. దీనితో రెండు నామినేషన్లు వేసారు. గురువారం చివరి రోజు కావడంతో ఇతర పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. 12వ వార్డు సభ్యుడు, వైసీపీ ఉపసర్పంచ్‌గా ఎన్నికైన జల్లా బాలకృష్ణ గతేడాది డిసెంబర్‌లో అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. దీనితో ఎన్నిక అనివార్యమైంది. 12వ వార్డులో 272 మంది ఓటర్లు ఉన్నట్లు స్టేజ్ వన్ అధికారిణి జీవన సంధ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శి ఎస్.ఠాగూర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్లకు ఆరు నామినేషన్లు

దెందులూరు: మండలంలో వార్డు మెంబర్ల ఎన్నికకు సంబంధించి బుధవారం నామినేషన్ల ప్రక్రియ జరిగింది. కొత్తగూడెంలో 5వ వార్డుకు, 2 నామినేషన్లు, 11వ వార్డుకు 2 నామినేషన్లు, కొవ్వలిలో 11వ వార్డుకు 2 నామినేషన్లు దాఖలయ్యాయి. కొత్తగూడెం నామినేషన్ల కార్యక్రమంలో సర్పంచ్ పరసా లక్ష్మీసుజాత, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), పార్టీ నాయకులు ఉన్నారు

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు



భీమడోలులో అగ్ని ఆస్త్రం తయారీ విధానాన్ని వివరిస్తున్న ఏడీఏలు, ఏవోలు, సిబ్బంది

భీమడోలు: ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ ఖర్చులతో అధిక దిగుబడులు సాధించవచ్చని భీమడోలు, ఏలూరు ఏడీఏలు పి.ఉషారాజకుమారి, కె.సుబ్బారావు అన్నారు. భీమడోలులో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో రైతులకు మేలైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. వరి పంటలో ఎరువుల యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆకుల కత్తిరింపు, పిలకలు తొలగింపు విధానాన్ని వారికి ప్రత్యక్షంగా చూపించారు. ఎండాకు తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తెలిపారు. 200 గ్రాముల ప్లాంటోమైసిన్, 400 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్ 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని ప్రిన్సిపల్ సైంటిస్టులు ఎస్.చాముండేశ్వరి, వి.భువనేశ్వరి, శాస్త్రవేత్త ఎస్.నాగేంద్రబాబు కోరారు. అగ్ని అస్త్రం తయారు చేసే విధానాన్ని ప్రకృతి వ్యవసాయం శాఖ సిబ్బంది రైతులకు ప్రత్యేక్షంగా చూపించారు. మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణి, వీఏఏలు పాల్గొన్నారు.

బాలల స్నేహపూర్వక గ్రామాలుగా తీర్చిదిద్దాలి



భీమడోలులో బాలల హక్కుల సంరక్షణ అంశాలపై వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

భీమడోలు: బాలల స్నేహపూర్వక గ్రామాలు తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా బాలల సంరక్షణాధికారిణి సూర్య చక్రవేణి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో బాలల హక్కులు, వారి రక్షణ తదితర అంశాలపై 10 గ్రామ పంచాయతీల పరిధిలోని బాలల పంచాయతీ, గ్రామస్థాయి బాల సంరక్షణా కమిటీ సభ్యులకు బాలల హక్కుల న్యాయవాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన క్రాప్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి బాలల హక్కులు, వాటి రక్షణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా జిల్లా బాలల సంరక్షణాధికారిణి సూర్య చక్రవేణి మాట్లాడుతూ బాలల స్నేహపూర్వక గ్రామాలు తీర్చిదిద్దబడడం ద్వారా సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బాలల హక్కులకు భంగ కల్గిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాలు, మైనర్లపై అత్యాచారాలను నియంత్రిచేందుకు గ్రామస్థాయిలో బాలల పంచాయతీ, బాలల సంరక్ష ణా కమిటీలు ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ కేవీపీ పద్మావతి మాట్లాడుతూ బాలల సంరక్షణలో తల్లిదండ్రుల పాత్ర కీలమన్నారు. తొలుత బాలల హక్కుల సంరక్షణ విధులు, బాధ్యతల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఈ.శ్రీనివాసరావు, ఎస్సై చావా సురేష్‌కుమార్, ఐసీడీఎస్ పీవో కె.విజయలక్ష్మి, హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్యసేవలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: లయన్స్ క్లబ్‌ల ద్వారా మారుమూల గ్రామాల్లోని పేదలకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ వెల్లంకి నరేష్ అన్నారు. బుధవారం ఆయన గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు ఉచిత కంటిపరీక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రావూరి నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెల్లంకి నరేష్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల అమలులో గణపవరం లయన్స్ క్లబ్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచి, జోన్‌లోనే మంచి గుర్తింపు పొందిందని అన్నారు. ఈ సందర్భంగా 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మాక్స్ విజన్ సంస్థ టెక్నీషియన్లు ఫణికృష్ణ, కరుణాకర్ కంటి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ జిల్లా చైర్మన్ కిలారి రవిబాబు, మాజీ అధ్యక్షుడు కె.సత్యనారాయణమూర్తి, లయన్స్ సభ్యులు చవ్వా రవి, ఫణి భాస్కర్, బొడ్డుగిరి, ఎస్.వాసు పాల్గొన్నారు.

వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి



భీమడోలు వద్ద వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్సై చావా సురేష్‌కుమార్

భీమడోలు: వాహనదారులు విధిగా హెల్మెట్‌లను ధరించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ అన్నారు. జాతీయ రహదారి భీమడోలు రైల్వే గేటు వద్ద బుధవారం భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలను తనిఖీ చేసి పలు సూచనలందించారు. ఈ సందర్భంగా ఎస్సై చావా సురేష్‌కుమార్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో తలకు బలమైన గాయాలై మృతి చెందుతున్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు భారీగా జరిమానాలు విధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు ప్రభుత్వం ప్రాధాన్యత



పూళ్లలో విద్యార్థులకు బస్ పాసులు అందిస్తున్న కందులపాటి శ్రీనివాసరావు తదితరులు

భీమడోలు: పేద కుటుంబాల్లోని విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని డీసీసీబీ జిల్లా డైరెక్టర్, వైసీపీ సీనియర్ నేత కందులపాటి శ్రీనివాసరావు అన్నారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 160 మంది బాల బాలికలకు డీసీసీబీ జిల్లా డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో బుధవారం ఉచిత బస్ పాసులు పంపిణీ చేశారు. ఈ సమావేశానికి హెచ్‌ఎం పి.భువనేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కందులపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేదల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బృహత్తర పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఏటా చిన్నారులకు ఉచిత బస్ పాసులను అందిస్తున్న కందులపాటి శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. శ్రీనివాసరావు ఘనంగా సత్కరించి ఆయనకు జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గొండు కృష్ణ చైతన్య, పేరెంట్స్ కమిటి చైర్మన్ పోలిశెట్టి నాగేశ్వరరావు, వార్డు సభ్యుడు యాసా వెంకట్రామయ్య, డిపో పీఆర్వో విజయకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించిన ఎంఈఓ

దెందులూరు: దెందులూరు సచివాలయంలో బడి బయట ఉన్న చిన్నారులు ఆడిపూడి అచ్చిబాబు, అడిపూడి విజయలక్ష్మిని పాఠశాలలో ఎంఈఓ అన్నమ్మ బుధవారం చేర్పించారు. కుటుంబ కలహాల వల్ల వేరే గ్రామాలకు వెళ్లిన తల్లి దండ్రులను ఒప్పించి పిల్లలను పాఠశాలలో చేర్పించిన వలంటీర్ కందుకూరి వెంకట్రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నెరుసు శ్రీలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ నాయుడు మాధురి దుర్గను ఎంఈఓ అన్నమ్మ అభినందించారు.

ఉద్యాన శాఖాధికారిగా కిరణ్

దెందులూరు: దెందులూరు మండల ఉద్యాన శాఖాధికారిగా కిరణ్ బుధవారం నియమితులయ్యారు. మండల కార్యాలయంలో ఆయన మండల ఉద్యానవన శాఖాధికారిగా బాధ్యతలు చేపట్టారు. 2023 జూన్‌లో ఏపీపీఎస్సీ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపికైనట్టు ఆయన అన్నారు. దెందులూరు మండలానికి రెగ్యులర్‌గా, జిల్లాలో 7 మండలాలకు తానే ఉద్యాన శాఖాధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తానని, జిల్లాలో ఉద్యానవన రైతుల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేస్తానని కరణ్ అన్నారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన

పెదపాడు: ఏబీబీ నిధులు రూ.5కోట్లతో నిర్మించనున్న పాతముప్పర్రు జయపురం రహదారిని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాదరావు బుధవారం పరిశీలించారు. మండల ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేసారు. రహదారి రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని అధికారులను కోరారు.

రావులపర్రులో నేడు గడపగడపకు మన ప్రభుత్వం

ఉంగుటూరు: మండలంలోని రావులపర్రులో గురువారం సాయంత్రం 4 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పార్టీ కార్యకర్తలు అధికార్లు పాల్గొనాలని మంగరావు కోరారు. ఉదయం 9.30 గంటలకు గొల్లగూడెంలో మెగా ఆయిల్‌ఫామ్ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో కూడా ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొంటారు. ఆయిల్‌ఫామ్ జిల్లా అధికార్లు, హార్టీకల్చర్ అధికార్లు పాల్గొనున్నారు.